క్లుప్తంగా

వాటర్‌మన్‌లకు శిక్షణ

భూపాలపల్లి రూరల్ : మిషన్ భగీరథ ఆధ్వర్యంలో గ్రామాల్లోని వాటర్‌మన్‌లకు నేటినుంచి వచ్చే నెల 9వతేదీ వరకు నీటి సరఫరా తదితర అంశాల్లో శిక్షణ ఇప్పించడం జరుగుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నిర్మల బుధవారం పేర్కొన్నారు. ప్రతి రోజు తాగునీటి సరఫరాలో ఎటువంటి ఆటంకాలు లేకుండా నిరంతరాయంగా సరఫరా జరగాలని, జిల్లాలోని ప్రతి మండలంలో నాలుగు రోజులు పాటు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని, షెడ్యూల్ ప్రకారం శిక్షణ నిర్వహించడానికి మాస్టర్ ట్రెయినర్లను కూడా నియమించడం జరిగిందని వివరించారు.

నేడు ప్లాస్టిక్ నిర్మూలనపై సమావేశం

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరం పంచాయతీలో గురువారం ప్లాస్టిక్ వాడకం, నిర్మూలనపై సమావేశం ఉందని కార్యదర్శి సత్యనారాయణ ప్రకటనలో తెలిపారు. చికెన్, కిరాణా, మటన్, మద్యం, కూల్‌డ్రింక్స్, కొబ్బరికాయలు, టీ స్టాల్స్, దుకాణాదారులు హాజరుకావాలని ఆయన కోరారు.

బాధ్యతల స్వీకరణ


శంకరయ్య

రేగొండ : రేగొండ సెకండ్ ఎస్సైగా శంకరయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చిట్యాల ఏఎస్సైగా పని చేసిన ఆయన పదోన్నతిపై రేగొండ సెకండ్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శాంతి భద్రతల పరిరక్షణలో, ప్రజా సమస్యల పరిష్కారంలో తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. పోలీస్ సిబ్బంది నూతన ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్ చేస్తాం

భూపాలపల్లి అర్బన్ : నంబర్ ప్లేట్, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు లేని ద్విచక్ర వాహనాలను సీజ్ చేస్తామని ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నంబర్ ప్లేట్, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు లేని వాహనాలను పట్టుకొని జరిమానాలు విధించడం జరుగుతుందన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఇక నుంచి కోర్టు అప్పగించనున్నట్లు తెలిపారు. దీంతో వాహనదారులకు మరింత ఇబ్బంది కలిగే ప్రమాదం ఉందన్నారు. జడ్జి నిర్ణయాన్ని బట్టి జరిమానా విధించే అవకాశాలు ఉంటాయన్నారు. వాహనదారులు తప్పని సరిగా పోలీసుల నిబంధలు పాటించాలని సూచించారు. బుధవారం నంబర్ ప్లేట్ లేకుండా పట్టుబడిన వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి నంబర్ ప్లేట్ వేసుకున్న అనంతరం జరిమానా విధించి పంపించారు.

మండల కమిటీ ఎన్నిక


కొక్కొండ అరవింద


మండ శ్రీనివాస్

రేగొండ : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మండల కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు తిరుపతి తెలిపారు. అధ్యక్షురాలిగా కొక్కొండ అరవింద, ప్రధాన కార్యదర్శిగా మండ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీపీయూఎస్ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బాధ్యులు విజయ్‌కుమార్, భాస్కర్‌రావు, నవీన్, బాపురెడ్డి, సాగర్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలి



భూపాలపల్లిరూరల్: జిల్లాలోని ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయానికి స్థలం కేటాయించాలని కోరుతూ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బుధవారం కలెక్టర్ రాహుల్‌శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా స్థలం కేటాయించాలన్నారు. ఎమ్మెల్యే వెంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవన్, భూపాలపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంపటి భువన సుందర్, పిప్పాల రాజేందర్, జంగిడి శ్రీనివాస్‌లు ఉన్నారు.

హిందీ టీచర్‌ను నియమించాలి

కన్నాయిగూడెం : మండలంలోని గూర్రేవుల జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ టీచర్‌ను వెంటనే నియమించాలని మాజీ వైస్ ఎంపీపీ బొల్లె భాస్కర్ అన్నారు. విద్యార్థులకు హిందీ సబ్జెక్ట తరగతులు ఆగిపోయినట్లు వెల్లడించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం


కాటారం: పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు


చిట్యాల: చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ అవంతి

కాటారం : పౌష్టికాహారం తీసుకోవడం వల్ల గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీణ, ప్రభుత్వ వైద్యురాలు వందన అన్నారు. పోషణమాసంలో భాగంగా బుధవారం మండలంలోని ధన్వాడ అంగన్‌వాడీ కేంద్రంలో వీఎచ్‌ఎస్ఎన్డీ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఎత్తు, బరువు పరీక్షించారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలు, సామ్, మామ్ పిల్లలను గుర్తించి పలు సూచనలు చేశారు. పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే బాలామృతం తినిపించాలని దానివల్ల ఎత్తుకు తగిన బరువుతో ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. అనంతరం పోషణమాసంలో భాగంగా ర్యాలీ నిర్వహించి పోషకాహార పదార్థాలపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు స్థానికంగా లభించే కూరగాయలు, ఆకు కూరలు, పప్పు దినుసులను రోజువారి ఆహారంలో తీసుకుంటే పోషకలోపం లేకుండా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు కారెంగుల శ్రీలత, తిత్తుల రజిత, ఏఎన్‌ఎం రజిత, ఆశ కార్యకర్తలు సంధ్య, గర్భిణులు, బాలింతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

టేకుమట్ల : మండలంలోని రాఘవరెడ్డిపేట, ఆరెపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు నిర్మల, రమ్య ఆధ్వర్యంలో గ్రోత్ మేళా పోషణ మాసోత్సాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు, కిశోర బాలికలు సమతులాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. బాలింతలకు పాలు సమృద్ధిగా ఉండడంతో పాటు బిడ్డ ఆరోగ్యానికి సహకరిస్తుందన్నారు. ఆయాలు రాజేశ్వరీ, వినోద, రజిత, ఆశ కార్యకర్తలు రజిత, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం

చిట్యాల : మండల కేంద్రంలోని ఒకటో, ఐదో అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రోత్‌మేళా, పోషణ మాసోత్సవాలను ఆయా అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐసీడీఎస్ సీడీపీఓ అవంతి, ఒడితల వైద్యురాలు మౌనిక హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ 0–5సంవత్సరాల పిల్లల బరువు, ఎత్తు ప్రతి నెల సరిచూసుకోవాలని అన్నారు. చిన్నారుల్లో పోషణ లోపాలను గుర్తించి తక్కువ బరువునకు గురి అయినట్లయితే ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అనంతరం చిన్నారులకు అక్షరాభాస్యం, అన్నప్రాసన చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయప్రద, అంగన్‌వాడీ టీచర్లు చింతల సంధ్యారాణి, జ్యోతి, కృష్ణవేణి, గర్భిణులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరికి బ్యాంకు ఖాతా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న సంతోష్

కాటారం(మహాముత్తారం) : ప్రతీ ఒక్కరు బ్యాంక్ ఖాతా కలిగి ఉండటం వల్ల అనేక ప్రయోజనాలు చేకూరుతాయని మహాముత్తారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సంతోష్ అన్నారు. మండల కేంద్రంలో టీజీబీ ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాజాతా బృందం బ్యాంక్ సేవలు, పథకాల గూర్చి ప్రజలకు వివరించారు. బ్యాంక్ మేనేజర్ సామాజిక భద్రత పథకాలు పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై, ఏపీవై వంటి పథకాల ప్రయోజనాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కళాజాతా బృందం విజయ్, సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు బాలకృష్ణ, రాజేశ్, సీఎస్‌పీ రమాకాంత్, దేవేందర్, బ్యాంక్ సిబ్బంది, గ్రామస్తులతో పాల్గొన్నారు.

రక్షణ కవచంతో గీతకార్మికులకు ప్రయోజనం


రక్షణ కవచంపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై

కాటారం : కాటమయ్య రక్షణ కవచంతో కల్లు గీత కార్మికులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని కాటారం ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య అన్నారు. మండలంలోని ధన్వాడలో ఎక్సైజ్ శాఖ, బీసీ సంక్షేమ శాఖ సమన్వయంతో బుధవారం కాటమయ్య రక్షణ కవచం ఉపయోగాలపై కల్లుగీత కార్మికులకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కాటారం సబ్‌డివిజన్ పరిధిలోని 134మంది కల్లు గీత కార్మికులకు ప్రత్యేకంగా శిక్షణ పొందిన వారితో రక్షణ కవచం ఉపయోగించు తీరును వివరించారు. గీతకార్మికులు రక్షణకవచం ధరించి తాటిచెట్లు ఎక్కడం ద్వారా ప్రమాదాలబారిన పడకుండా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైతో పాటు సిబ్బంది రాంచందర్, వెంకట్‌రాజ్, కోటేశ్వర్, ట్రెయినర్స్ జశ్వంత్, తిరుపతి, అంజన్న, అశోక్, వెంకట్రాజం, గీత కార్మికులు చీటూరి లింగంగౌడ్, మార్క రవీందర్, కారెంగుల వెంకటరాజం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి

భూపాలపల్లి రూరల్: భారతీయ జన సంఘ్ సిద్ధాంతకర్త దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి ఏకాత్మ మానవతావాద సిద్ధాంతం అందించిన మహానుబావుడన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బట్టు రవి, దొంగల రాజేందర్, సామల మధుసూదన్ రెడ్డి, మాచినవేణి రవీందర్, మునేందర్, పాన్నాల కొమురయ్య పాల్గొన్నారు.

ఎంఈఓలుగా బాధ్యతలు


రేగొండ(కొత్తపల్లిగోరి): ఎంఈఓ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు


టేకుమట్ల: సుధాకర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పలిమెల : మండలంలోని అంబటిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న వెంకటరాజం మండల విద్యాధికారిగా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు సహకరిస్తానన్నారు.

మండల ప్రథమ ఎంఈఓగా చంద్రశేఖర్

రేగొండ(కొత్తపల్లిగోరి): నూతనంగా ఏర్పాటైన కొత్తపల్లిగోరి మండలానికి ప్రథమ మండల విద్యాధికారిగా ఒంటేరు చంద్రశేఖర్ నియమితులయ్యారు. జగ్గయ్యపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్న ఆయనకు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిరిధర్ కృష్ణ, రాజేందర్, చక్రధర్, కుమారస్వామి, శ్రీధర్, కోటిలింగం, కల్పన, మహేందర్, శిరీష, శ్రీనివాస్, మాధవి, ప్రతాప్ పాల్గొన్నారు.

ఎంఈఓగా కుమారస్వామి

మొగుళ్లపల్లి : మండల విద్యాశాఖ అధికారిగా మొట్లపల్లి కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లింగాల కుమారస్వామి బుధవారం బాధ్యతలు చేపట్టారు. మండల నోడల్ అధికారి (ఎంఎన్‌ఓ)గా విధులు నిర్వహిస్తున్న వారికి పూర్తి అదనపు బాధ్యతలతో ఎంఈఓలుగా నియమించింది. కాగా ఎంఎన్‌ఓగా అదనపు విధులు నిర్వహిస్తున్న కుమారస్వామి మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయం సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది చంద్రమౌళి, వేణు, సదయ్య, సురేందర్, వసంత, రమాదేవి, రమేష్ పాల్గొన్నారు.

ఎంఈఓకు సన్మానం

కాళేశ్వరం : మహదేవపూర్ మండల విద్యాధికారి శంకరయ్యను పీఆర్‌టీయూ తెలంగాణ మండల శాఖ అధ్యక్షుడు ఎల్కటి శరత్ ఆధ్వర్యంలో మండల వనరుల కేంద్రంలో బుధవారం సన్మానించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా అధ్యక్షుడు రాచర్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పసుల శంకర్ నేత మాట్లాడుతూ నూతన విద్యాధికారుల నియామకం కావడంతో విద్యావ్యవస్థలో ఒక సమూలమైన మార్పును వచ్చే విధంగా ఉందని అన్నారు. ప్రతి పాఠశాలను సందర్శించి వ్యవస్థాపరమైన లోపాలను సరిదిద్దాలని వారు కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కుమారస్వామి, అంజుం సిద్దిక, రశీద బేగం, సరావత్ సుల్తానా, తిరుపతి, సుధారాణి, సాంబయ్య, అనిల్, రాజ్‌కుమార్, సిబ్బంది స్వాతి, మహేష్, నాగరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంఈఓగా సుధాకర్

టేకుమట్ల : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఎన్‌ఓగా విధులు నిర్వర్తిస్తున్న చిదిరాల సుధాకర్ మండల ఇన్‌చార్జ్ విద్యాధికారిగా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా పీఆర్‌టీయూ తెలంగాణ సంఘం నాయకులు ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన సుధాకర్‌ను సన్మానించారు. నాయకులు ఆరె రాకేష్‌రెడ్డి, నెరుపటి ఆనంద్, మహేందర్, ఉమాదేవి, రాధిక, ప్రవీన్, ఆసిఫ్, హకీం, రామచంద్రు, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

28న లోక్ అదాలత్


అవగాహన కల్పిస్తున్న తిరుపతి

చిట్యాల : జిల్లా న్యాయసేవ సాధికారత సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 28న నిర్వహించే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల పారా లీగల్ వలంటీర్ ఆరెపల్లి తిరుపతి కోరారు. ఈసందర్భంగా బుధవారం మండల కేంద్రంలో స్థానికులకు ఆయన అవగాహన కల్పించారు. రాజీ పడదగిన కేసులు సివిల్, క్రిమినల్ కేసులు, ఎక్సైజ్, భార్యాభర్తల కేసులు, యాక్సిడెంట్ కేసులకు లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని తెలిపారు. రాజీమార్గమే రాజమార్గనే నినాదంతో ముందుకు వెళ్లాలని కోరారు. చిన్నచిన్న కేసులతో కోర్టుల చుట్టూ తిరిగి డబ్బులు వృథా చేసుకోవద్దని కోరారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

కాటారం : తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టీఓఎంసీఓఎం) ఆధ్వర్యంలో ఈ నెల 27న వరంగల్‌లోని ఐటీఐ కళాశాల బాలుర క్యాంపస్‌లో ఐటీఐ, డిప్లొమా, బీటెక్ పూర్తి చేసిన నిరుద్యోగులకు విదేశాల్లో ఉపాధి అవకాశాలపై ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కాటారం ఐటీఐ ప్రిన్సిపాల్ భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. మెకానికల్, ఎలక్ట్రికల్, బీఎంఎస్ ఆపరేటర్, ఎంఈపీ టెక్నిషియన్, సూపర్‌వైజర్‌లకు యూఏఈలో అధిక డిమాండ్ ఉందని తెలిపారు. 2నుంచి 4 సంవత్సరాల అనుభవం, 20 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల వారికి యూఏఈలో మంచి ప్యాకేజీతో అవకాశాలు ఉన్నాయని టీఓఎంసీఓఎం తెలిపినట్లు పేర్కొన్నారు. సురక్షితమైన, చట్టబద్ధమైన వలస మార్గాల ద్వారా రిక్రూట్‌మెంట్ ప్రక్రియను సులభం చేయడానికి టీఓఎంసీఓఎం నిరుద్యోగులకు సహాయం చేస్తోందని తెలిపారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగులు తమ సర్టిఫికెట్లతో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌కు హాజరుకావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ప్రశాస్త్ యాప్‌పై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న రఘుపతి

చిట్యాల : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ప్రశాస్త్ యాప్‌పై ఉపాధ్యాయులకు బుధవారం ఎంఈఓ కొడెపాక రఘుపతి అవగాహన కల్పించారు. ప్రశాస్త్ యాప్ అనేది 21రకాల వైకల్యాలను గుర్తించడంలో ఉపయోగపడుతుందన్నారు. ఈ యాప్ ద్వారా స్క్రీనింగ్ చేసి పిల్లల వైకల్యాన్ని గుర్తించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఎంఎన్‌ఓ కృష్ణ, ప్రధానోపాధ్యాయులు కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల గుర్తింపు శిబిరం



కాళేశ్వరం: కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా దివ్యాంగుల సంక్షేమ అధికారి ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉపకరణాలు అందించేందుకు ఏఎల్ఐఎంసీఓ, దివ్యాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉపకరణముల గుర్తింపు శిబిరాన్ని నిర్వహించారు. బుధవారం మహదేవపూర్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఈ శిబిరం నిర్వహించగా మహదేవపూర్, పలిమెల, మల్హర్ మండలాలకు చెందిన శారీరక, మానసిక, వినికిడి లోపం, తదితర సమస్యలు ఉన్న 140 మంది పాల్గొన్నారు. ఇందులో అర్హత కలిగిన వారికి త్వరలో ఉపకరణాలు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి చిన్నయ్య, మాజీ ఎంపీపీ రాణిబాయి, తహసీల్దార్ ప్రహ్లద్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, పలిమెల ఎంపీడీఓ శ్రీనివాస్, మహదేవపూర్ సీడీపీఓ రాధిక, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి


టిఫిన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

భూపాలపల్లి రూరల్ : యువత ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని కుటుంబానికి ఆసరాగా నిలబడాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం మంజూరు నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంజూరైన మొబైల్ టిఫిన్ సెంటర్‌ను బెడ్డలపల్లి గ్రామానికి చెందిన దుర్గం లింగమూర్తికి వాహనం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ఏదో ఒక పనిచేసుకుని కుటుంబానికి అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ అభివృద్ధి అధికారి ఈడీ వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ ఏకు రవీందర్, పార్టీ నాయకులు బెడ్డల తిరుపతి, కుమ్మరి తిరుపతి ఉన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

చిట్యాల : ఈనెల 29న హనుమకొండలో జరిగే రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లాల 48వ వార్షికోత్సవ మహాసభను విజయవంతం చేయాలని ఏవైఏస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య కోరారు. ఈసందర్భంగా బుధవారం మండల కేంద్రంలో కరపత్రం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అంబేడ్కర్ యువజన సంఘాల నాయకులు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు గుర్రపు రాజేందర్, సరిగోమ్ముల రాజేందర్, పుల్ల ప్రతాప్, గురుకుంట్ల కిరణ్, కనకం తిరుపతి, దాసారపు నరేష్, పాముకుంట్ల చందర్, నేరేళ్ల సమ్మయ్య, కలికోట సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


నివాళులర్పిస్తున్న గండ్ర వెంకటరమణారెడ్డి

చిట్యాల : మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి బుధవారం పరామర్శించారు. చిట్యాల మండలకేంద్రానికి చెందిన తూటిచర్ల నర్సయ్య, కొత్తపేట గ్రామానికి చెందిన మధురకవి దినేష్, ఒడితల గ్రామానికి చెందిన యాంసాని భద్రయ్య, కోడూరి రాజసమ్మయ్య, అందుకుతండాకు చెందిన భూక్యా పూల్‌సింగ్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్, పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతికుమార్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాంబాబు, బీఆర్ఎస్ మండల నాయకులు అల్లం రవీందర్, రాజు నాయక్, కట్కూరి రాజేందర్, పెరుమాండ్ల రవీందర్‌గౌడ్, పాండ్రాల స్వామి, మడికొండ రవీందర్ రావు, దామెర రాజు, దొడ్డె శంకర్, పులి వెంకటేశ్, నాగేందర్, తిరుపతి తదితరులు ఉన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

చిట్యాల: వీఆర్ఏ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ హేమకు వీఆర్ఏలు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం వీఆర్ఏల సర్దుబాటు కోసం ఇచ్చిన జీఓలతో ప్రమోషన్ పొంది తక్కువ సర్వీస్ చేసి ఏలాంటి బెనిఫిట్స్ పొందకుండా ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. 61 సంవత్సరాలు దాటిన వీఆర్ఏ వారసులకు ఉద్యోగం కల్పించాలని, 55 నుంచి 61 సంవత్సరాల మధ్యలో ఉన్న వీఆర్ఏల వారసులకు ఉద్యోగం కల్పించి ఆదుకోవాలన్నారు.అలాగే దూరప్రాంతాల్లో పోస్టింగ్ ఇచ్చిన వారిని తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గుండ నర్సయ్య, సతీష్, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలు


సన్మానం పొందిన ఉత్తమ ఉపాధ్యాయులతో నాయకులు

చిట్యాల : నేటి సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు అని తహసీల్దార్ ఎన్.హేమ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో వ్యాస పౌర్ణమి సందర్భంగా గురువందనం కార్యక్రమంలో భాగంగా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానించారు. అనంతరం తహసీల్దార్ హేమ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ ఉన్నత స్థానంలో ఉండడానికి ఉపాధ్యాయులే కారణమన్నారు. ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విద్యార్థులను ఆదర్శ పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు మెమోరాండం, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కో-కన్వీనర్ పులి సరోత్తంరెడ్డి, ఎంఈఓ రఘుపతి, ఎంపీడీఓ రామకృష్ణ, తపస్ జిల్లా అధ్యక్షుడు ములకల్ల తిరుపతి, ప్రధాన కార్యదర్శి పత్తి వెంకటరావిరెడ్డి, మండల అధ్యక్షుడు కానుగుల రఘుపతి, ప్రధాన కార్యదర్శి గోపగాని భాస్కర్, వివిధ పాఠశాలలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులు పాముకుంట్ల తిరుపతయ్య, ఝాన్సీ రెడ్డి, మధు, సుధాకర్, లక్ష్మీపతి, రాధిక, సునీత, శంకర్, రవీందర్, హసీనా, నవత, చిరంజీవి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

‘దళితబంధు’ అమలు చేయాలని వినతి


మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన నాయకులు

కాళేశ్వరం/మల్హర్ : గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో దళితబంధు పథకం ప్రొసీడింగ్‌లు వచ్చిన లబ్ధిదారులు ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబును హైదరాబాద్‌లో బుధవారం కలిశారు. ప్రొసీడింగ్‌లు వచ్చి డబ్బులు మంజూరై జిల్లా కలెక్టర్ అకౌంట్లో ఉన్నప్పటికీ ఎన్నికల కోడ్ కారణంగా తమ పథకం అమలు కాకుండా పోయిందని వీరు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. గత ప్రభుత్వం దళితులను ఎన్నికల కోసం వాడుకోవాలని చూసిందని ప్రభుత్వాలు ఏవి ఉన్న దళితుల పట్ల సానుభూతితో వ్యవహరించాలని మంథని నియోజకవర్గంలోని దళితబంధు లబ్ధిదారులు విజ్ఞప్తి చేశారు. దళిత బంధు పథకం సమస్య ఒక ప్రాంతానికి పరిమితమైంది కాదని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సమస్య కాబట్టి ఆలోచన చేసి సరైనా నిర్ణయం తీసుకుంటామని మంత్రి దళిత నేతలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్హర్, మహదేవపూర్, కాటారం, పలిమెల దళితబంధు నాయకులు పాల్గొన్నారు. భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు దళిత బంధు సాధన సమితి అధ్యక్షుడు సంపత్, వేమునూరి జక్కయ్య, పులి రామన్న, జిల్లా వైస్ ప్రెసిడెంట్ చకినారపు చందు, జిల్లా ఆర్గనైజర్ కార్యదర్శ దుర్గం గుణవంతు, జనగామ రాజేష్, మంచినీళ్ల శ్రీనివాస్, లింగాల కోటేష్, పులిగంటి శ్రీనివాస్, చిట్యాల సమ్మయ్య, బొడ్డు రాజబాబు తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.